నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, బుధవారం 4 సెప్టెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

ముంచిన నిర్లక్ష్యం!

- వరదనీటిలో 'వెంకటాద్రి' పంప్‌హౌస్
- నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం సమీపంలో సొరంగంలోకి నాగనూలు చెరువునీళ్లు
- 20 కి.మీ. టన్నెల్‌ను ముంచెత్తిన జలాలు
- నష్టం కోట్లల్లో ఉంటుందని అధికారుల అంచనా?

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 3 : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామం వద్ద నిర్మించిన వెంకటాద్రి రిజర్వాయర్ పంప్‌హౌస్‌ను వరద ముంచెత్తింది. దీంతో రూ.కోట్లల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని శ్రీపురం గ్రామం శివారులో నిర్మించిన టన్నెల్ మీదుగా వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. అయితే నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ సొరంగం సమీపంలో ఉన్న నాగనూలు చెరువులోకి భారీగా వరద నీరు చేరింది. టన్నెల్‌ను అనుసరించి ఉన్న కట్టుకు గండి పడడంతో ఈ నీరంతా సొరంగంలోకి పరుగులు పెట్టి కుమ్మెర వరకు ఉన్న 20 కిలోమీటర్ల సొరంగాన్ని ముంచెత్తింది. ముందుగా సర్జ్‌పూల్.. అక్కడి నుంచి పంపింగ్ హౌస్‌లోకి చేరడంతో నీట మునిగింది. ఒక్కో హౌస్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుకు మించి భారీ పంపులను బిగించారు. ఒక్కో పంప్ హౌస్‌లో 9 భారీ పంపులు, ఒక స్పేర్ పంపుతో కలిపి పది పంపులు ఏర్పాటు చేశారు. వరదతోపాటు బురద కూడా వచ్చే అవకాశం ఉన్నందునా ఈ మొత్తం పంపుల్లోకి చేరి భారీ నష్టానికి దారి తీస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు అక్కడక్కడ సొరంగ మార్గాల్లో మిషనరీలు, పంప్‌హౌస్‌కు సొరంగం నుంచి వచ్చే నీటికి మధ్య భారీ వరద ఉంటుంది. ఈ వరద మొత్తం బయటికి తీయాలంటే పెద్దపెద్ద పంపులు అవసరం. నెల కంటే ఎక్కువ సమయం పట్టొచ్చన్న పేర్కొంటున్నారు. వరద మొత్తం తొలగించాక నష్టం అంచనా వేసే అవకాశం ఉన్నది.

పరిశీలించిన చిన్నారెడ్డి..

పాలమూరు ప్రాజెక్టు పరిధిలోని వట్టెం పంప్‌హౌస్‌లోకి వరద నీరు రావడంతో మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పరిశీలించారు. ఎస్ఈ సత్యనారాయణగౌడ్, భాగయ్యకు దిశానిర్దేశం చేశారు. ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మాణ సంస్థ ఇంకా ప్రభుత్వానికి అప్పగించలేదని, పంప్‌హౌస్‌లోని నీటిని ఎత్తిపోసి పంపులను పూర్వ స్థితికి తీసుకొచ్చే బాధ్యత ఆ సంస్థదే అన్నారు. ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థికభారం పడదన్నారు. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్‌లో జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీర్లకు సూచించారు.

నీట మునిగిన వట్టెం పంప్‌హౌస్

శ్రీపురం సమీపంలోని టన్నెల్లోకి పరుగులు పెడుతున్న నాగనూలు చెరువు బ్యాక్‌వాటర్

టన్నెల్లోకి వెళ్తున్న నాగనూల్ చెరువు నీరు

అధికారుల తర్జన.. భర్జన

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని శ్రీపురం సమీపంలో నాగనూల్ చెరువు బ్యాక్‌వాటర్ టన్నెల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం తర్వాత పనులు చేపట్టారు. ఖాళీ సిమెంట్ సంచుల్లో రాక్ చిప్స్‌ను నింపి గండిపడిన టన్నెల్ కట్టకు అడ్డుగా వేస్తున్నారు. పక్కనే ఉన్న బండరాళ్లను చెరువు నుంచి నీరు కిందికి పోకుండా కట్టగా నిర్మించారు. సాయంత్రం అయినప్పటికీ కొలిక్కి రాలేదు. బుధ లేదా గురువారం నాటికి అడ్డుకట్ట పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. టన్నెల్‌లోకి వెళ్లే నీటి ప్రవాహం నిలిచిపోయాక ఏం చేయాలని దానిపై నిర్ణయం తీసుకుంటామని పాలమూరు ప్రాజెక్టు అధికారులు 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. కుమ్మెర వద్ద వరద తగ్గడంతో అధికారులు, కాంట్రాక్టర్లు చేరుకొని వెంటనే వరద నీటిని అడ్డుకట్ట వేశారు. అయితే నాగనూలు వద్ద పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ఈ పెద్ద చెరువు 50 స్క్వేర్ కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉండగా.. దీని పరిధిలో సుమారు 40 చిన్నచిన్న గొలుసుకట్టు చెరువులు సమీపంలోనే ఉన్నాయి. ఇవన్నీ ఉప్పొంగడంతో అక్కడి నీరంతా ఈ చెరువుకు చేరింది. వరద భారీగా ఉండడంతో అధికారులు సైతంసహాయక చర్యలు చేపట్టలేకపోయారు. సొరంగం తవ్విన ప్రాంతం దిగువన ఉండడంతో చెరువులోని బ్యాక్ వాటర్ అంతా అడ్డుగా ఉన్న ప్రాంతాన్ని చీల్చుకొని సొరంగంలోకి ప్రవేశించింది. టన్నెల్లోని నీటిని తొలగించే అంశంపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. పాలమూరు ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన 7వ ప్యాకేజీలోని టన్నెల్ నుంచి వరద వస్తున్న ప్రాంతాన్ని గుర్తించిన అధికారులు నీటిని మళ్లించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరకు ఆలస్యంగా తేరుకొని చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. వరద తీవ్రత ఎక్కువగా ఉండడంతో నీటిని మళ్లించే ప్రయత్నాలు అధికారులకు కష్టతరంగా మారాయి. మరోవైపు అధికారులు మాత్రం కోట్లల్లో నష్టం జరిగినా వివరాలు తెలపడానికి, మీడియాను పంప్‌హౌస్ వద్దకు అనుమతికి నిరాకరించారు. పెద్ద మొత్తంలో నష్టం జరిగిన విషయాన్ని దాచిపెట్టేందుకు కంపెనీ, అధికార యంత్రాంగం ప్రయత్నిస్తున్నది. కాగా, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగినా ఉన్నతాధికారులు ఎవరూ సందర్శించక పోవడం గమనార్హం.

ముందుచూపు లేకనే మునిగింది..

ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్లే వట్టెం రిజర్వాయర్ పంప్‌హౌస్ నీట మునిగింది. భారీ వర్షాలు పడుతున్నా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయకపోవడం వల్లే ఈ నష్టం జరిగింది. త్వరితగతిన ఈనష్టాన్ని అంచనా వేసి వట్టెం పంప్‌హౌస్ పనులు పునరుద్ధరించాలి. సాగు, తాగునీరు అందించే సదుద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును ప్రారంభించింది. అయినా వీటి నిర్వహణను కాంగ్రెస్ గాలికొదిలేసింది. అలాగే నష్టపోయిన పంటల అంచనా వేసి పరిహారం అందించాలి. తెగిన చెరువు, కుంటలకు మరమ్మతులు చేపట్టాలి. బీటీ రోడ్లను పునరుద్ధరించాలి.

- మర్రి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఏజెన్సీ, అధికారులు ఏం చేస్తున్నారు?

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన నాలుగు పంప్‌హౌస్‌లలో మూడో పంప్‌హౌస్ వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్. రూ.2,437 కోట్లతో కొనుగోలు చేసిన మోటర్లు వరదతో నీట మునగడం సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనం. వరదల్లోస్తే నీళ్లు ప్రవహిస్తాయని మేఘా ఏజెన్సీకి, అధికారులకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ప్రారంభానికి ముందే ఈ దుస్థితి నెలకొనడం దారుణం. ఒకవేళ నీటిని ఎత్తిపోసినా మోటర్ల పని విధానం ఎలా ఉంటుందో తెలియదు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఏజెన్సీ, అధికారులపై చర్యలు తీసుకొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలి.

- నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి

శ్రీపురం సమీపంలో టన్నెల్లోకి వెళ్తున్న వరద నీటికి అడ్డుకట్టగా టిప్పర్ల ద్వారా వేస్తున్న బండరాళ్లు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

పాలమూరుపై నిర్లక్ష్యమెందుకు?

- రేవంత్ సర్కారు తట్టెడు మట్టి పోసింది లేదు
- ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల్లో ప్రాణనష్టం
- రూ.25లక్షల పరిహారం అందించాలి
- వరుణుడి కరుణతో చెరువులకు నీళ్లు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని, ప్రభుత్వ వైఫల్యం ద్వారానే వరదల్లో ప్రాణనష్టం సంభవించిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం వనపర్తిలో సింగిరెడ్డి నివాసంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద విపత్తులకు ముందే అప్రమత్తంగా ఉండాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగిందన్నారు. ఇంతటి సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఉండి కూడా ప్రజానీకం తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవించే పరిస్థితులు రావడం బాధాకరమన్నారు. ప్రజల బాధలు చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని, ఒక సైంటిస్టును, ఆమె తండ్రిని వరదల్లో కోల్పోవడం ద్వారా ప్రభుత్వం ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందో అర్థమవుతున్నదన్నారు. సీఎం వరదలను చూసేందుకు వస్తుంటే పూల అలంకరణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఖమ్మంలో ముగ్గురు మంత్రుల తీరుపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్నదని, వారి అవసరాలకు హెలిక్యాప్టర్లు ఉంటాయి కానీ, పేదల ప్రాణాలు కళ్లే దుట పోతుంటే హెలిక్యాప్టర్లు లేవని చెప్పడం దారుణమన్నారు. గతంలో కూడా వరదలు వచ్చాయని, అప్పట్లో బీఆర్ఎస్ ఉదారంగా వ్యవహరించిన తీరును గుర్తుచేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎవరిపై నిందలు వేయకుండా పనిచేసి చూయించామన్నారు. పదేండ్లలో ఎనలేని అభివృద్ధి చేసినా గోరంతను కొండంతను చేసి చూపించిన మీడియా నేడు ప్రభుత్వ తప్పిదాలపై ఎందుకు మౌనం దాల్చుతున్నదని ప్రశ్నించారు. జూరాల ప్రాజెక్టు ద్వారా రెండు నెలలుగా నీటిని కిందకి వదులుతుంటే, ఇక్కడి చెరువులను నింపాలన్న కనీస ఆలోచన కూడా పాలకులకు లేకపోవడం విచారకరమన్నారు. వరుణుడి కటాక్షంతో జిల్లాలో చెరువులకు నీళ్లు వచ్చాయని చెప్పారు. లేదంటే రానున్న కాలంలో ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉండేవన్నారు.

రూ.25లక్షల పరిహారమివ్వాలి..

ప్రతిపక్షంలో ఉండి, కాంగ్రెస్ అధ్యక్షుడి హోదాలో బాధితుల కోసం రేవంత్‌రెడ్డి గతంలో రూ.25లక్షల పరిహారాన్ని డిమాండ్ చేశారని సింగిరెడ్డి గుర్తు చేశారు. నేడు సీఎంగా రేవంత్‌రెడ్డి ఉన్నారని, వరదలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం రూ.5లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదని, డిమాండ్ చేసింది కూడా ఇవ్వకలేకపోతే ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. పాలమూరుకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పటికీ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో ఈ ప్రభుత్వంలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదన్నారు. వీరి నిర్లక్ష్యం పుణ్యమా అంటూ 12 లక్షల ఎకరాలకు నీరు అందివ్వాల్సిన ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురవుతున్నదన్నారు. మంత్రులు సైతం ప్రాజెక్టును ఒక్క రోజు కూడా సందర్శించిన దాఖలాలు లేవని, ఇలా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తూ కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలన్నీ బోగస్‌గా తేలిపోయాయన్నారు. రాష్ట్రంలో వరదల మూలంగా జరిగిన పంట నష్టం, ఇసుక మేటలు వేసిన వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని, అలాగే పంట నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు లక్ష్మయ్య, రమేశ్‌గౌడ్, మాణిక్యం, అశోక్, గులాం ఖాదర్, రఘునాథ్‌రెడ్డి, పరంజ్యోతి, మహేశ్వర్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు..

పెద్దమందడి, సెప్టెంబర్ 3 : మండలంలోని వెల్టూరు గోపాల సముద్రం చెరువు మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి అలుగు పారింది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెరువు వద్దకు వెళ్లి గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పూలు సమర్పించి పూజలు చేశారు. అదేవిధంగా కట్టపై ఉన్న కట్టమశమ్మ, వేణుగోపాలస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు నేతలు రఘుపతిరెడ్డి, వేణుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్, అశోక్, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదయ్య, రఘువర్ధన్‌రెడ్డి, సురేశ్, ఆంజనేయులు, శ్రీధర్, గణేశ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 3 : జిల్లా కేంద్రంలోని విమోచన దవాఖాన ఎండీ డాక్టర్ రాఘవులు సతీమణి మరియమ్మ ఇటీవల ఆనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, తిరుమల్, గులాం ఖాదర్‌ఖాన్, స్టార్ రహీం, పరంజ్యోతి, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, తోట శ్రీను తదితరులు ఉన్నారు.

చెంచులు సేఫ్

- రెండు రోజులు దుందుభీ వాగులోనే..
- 12 మందిని కాపాడిన రెస్క్యూ టీం, గజ ఈతగాళ్లు
- అభినందించిన అచ్చంపేట, దేవరకొండ ఎమ్మెల్యేలు

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 3 : దుందుభీ వాగులో చేపలవేటకు వెళ్లి నీటిలో చిక్కుకున్న 12 మంది చెంచులను నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల రెస్క్యూ టీం రెండు రోజులు శ్రమించి గజ ఈతగాళ్ల సాయంతో ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఇందుకు సంబంధించి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మనపల్లి-సిద్దాపూర్ శివారులోని గుర్రలబండ సమీపంలో వాగులో నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లికి చెందిన 12 మంది (ఆరుగురు పురుషులు, నలుగురు స్త్రీలు, ఇద్దరు చిన్నారులు) చెంచులు జీవనాధారమైన చేపల వేటకు వెళ్లారన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోనబోయినపల్లి వైపు వాగు ఒక్కసారిగా ఉధృతంగా పారడంతో వారంతా గుర్రాలబండ వద్ద ఎత్తైన్న బండపైకి ఎక్కి తమ బంధువులకు సమాచారమిచ్చారన్నారు. చెంచుల బంధువులు ఈ విషయాన్ని సోమవారం రాత్రి పోలీసులకు తెలుపడంతో అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ స్థానిక యువకుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో వారికి సహాయం అందించేందుకు వీలుకాలేదు. మంగళవారం ఉదయం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఘటన సమీప ప్రాంతానికి చేరుకొని నాగర్‌కర్నూల్, నల్లగొండ ఎస్పీలు వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, శరత్ చంద్ర పవార్‌కు సమాచారం అందించారు. ఎస్పీలు అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, ఎస్సైలు రాములు, పవన్‌కుమార్, రాజుతోపాటు 50మంది రెస్క్యూ టీం, అగ్నిమాపక శాఖ సిబ్బంది, గజఈతగాళ్ల సాయంతో తాళ్లు, పుట్టీల సహకారంతో నీటిలో చిక్కుకున్న 12 మంది చెంచులను ఎలాంటి ప్రాణాపాయం లేకుండా సంరక్షించారు. దీంతో ఎమ్మెల్యే పోలీసులు, అగ్నిమాపక శాఖ, గజ ఈతగాళ్లను అభినందించారు. చెంచులకు ఆహారం అందించి చికిత్స కోసం అచ్చంపేట వంద పడకల ఏరియా దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఇద్దరు ఎమ్మెల్యేలు డిండి ప్రాజెక్టును రైతులతో సందర్శించి మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

వాగులో నుంచి సురక్షితంగా బయటకు వచ్చిన చెంచు కుటుంబాలతో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలునాయక్

వరద బాధితులకు నేను సైతం..

- సీఎంఆర్ఎఫ్‌కు రూ.3వేలు అందించిన బాలిక

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 3 : వరద ముంపు బాధితులను ఆదుకోవాలనే ఆలోచనతో తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను మంగళవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీఎం సహాయనిధికి పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయిసింధు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం సహా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ బాలికను అభినందించారు.

ఏసీబీ వలకు అవినీతి చేప

- రూ.10 వేలు తీసుకుంటూ పట్టుబడిన డిప్యూటీ డీసీటీవో
- వివరాలు వెల్లడించిన ఏసీబీ రేంజ్ ఏఎస్పీ కృష్ణగౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 : ఏసీబీ వలకు అవినీతి చేప చిక్కింది. జీఎస్టీ లైసెన్స్ ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ ఓ అధికారి పట్టుబడిన ఘటన చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి ఏసీబీ ఏఎస్పీ కృష్ణగౌడ్ వివరాలు వెల్లడించారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం పిల్లిగుండు తండాకు చెందిన రాత్లావత్ సంతోష్‌నాయక్ మహబూబ్‌నగర్‌లోని మర్లు ప్రాంతంలో వ్యాపారం కోసం దుకాణం అద్దెకు తీసుకున్నాడు. వీడీఎన్ ట్రేడర్స్ అనే పేరుతో బిజినెస్ చేసేందుకు జీఎస్టీ లైసెన్స్ కావాలని ఆగస్టు 17న జడ్చర్ల సీఐ ఉస్మాన్‌ను సంప్రదించి అనంతరం మీ సేవలో అప్లికేషన్ చేశాడు. అదే నెల 22న డిప్యూటీ డీసీటీవో (డిస్ట్రిక్ట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్) వెంకటేశ్వర్‌రెడ్డి దుకాణం తనిఖీ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని, లైసెన్స్ రద్దు చేస్తానని హెచ్చరించారు. దీంతో సదరు వ్యాపారి వీలైతే డబ్బు ముట్టజెబుతానన్నాడు. ఇందుకు రూ.50 వేలు ఇవ్వాలని అధికారి డిమాండ్ చేయగా..రూ.10 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత ఏసీబీ అధికారులను సంప్రదించగా వారి పథకం మేరకు.. మంగళవారం న్యూ టౌన్‌లోని కార్యాలయ ప్రాంతంలో నగదు అందజేస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వెంకటేశ్వర్‌రెడ్డి నుంచి నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఆయన చాంబర్‌లో పలు దస్త్రాలను పరిశీలించారు. అనంతరం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించారు. లంచం డిమాండ్ చేస్తే డయల్ 1064కి సమాచారం ఇవ్వాలని కృష్ణగౌడ్ సూచించారు. దాడుల్లో ఏసీబీ సీఐ జిలానీ, సిబ్బంది ఉన్నారు.

అధికారి ఇంట్లో సోదాలు

గద్వాలలోని ఇల్లు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 3 : మహబూబ్‌నగర్‌లో లంచం తీసుకుంటూ డీసీటీవో వెంకటేశ్వర్‌రెడ్డి ఏసీబీకి పట్టుబడ్డాడు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్‌రెడ్డి స్వగ్రామమైన గద్వాల పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న ఆయన ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నల్లగొండ ఏసీబీ ఎస్సైలు వెంకట్రావు, రామారావు ఆధ్వర్యంలో 9 మంది సభ్యులు దాడుల్లో పాల్గొన్నారు. వెంకటేశ్వర్‌రెడ్డి భార్య, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ప్రవీణను విచారించారు. ఆస్తులుగానీ, సంబంధించిన పత్రాలు, నగదు దొరకలేదని కృష్ణగౌడ్ తెలిపారు.

శిబిరం వద్ద నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఇండ్ల బాధితులకు శ్రీనన్న అండ

- పాలమూరులో నెలకు సరిపడా సరుకులు అందజేత
- న్యాయం చేసే వరకు వెన్నంటే ఉంటామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భరోసా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 3 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో కూల్చివేతకు గురైన ఇండ్ల బాధితులకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అండగా నిలిచారు. 25 కుటుంబాలకు నెలరోజులకు సరిపడా సరుకులు, బియ్యాన్ని సాయంగా అందజేశారు. మంగళవారం బ్లైండ్‌లేమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరంలో పేదలు, దివ్యాంగులకు బీఆర్ఎస్‌నాయకులు వీరికి ఉచితంగా పంపిణీ చేశారు. దివ్యాంగులు, నిరుపేదలు కట్టుకున్న ఇండ్లను అక్రమ నిర్మాణాలంటూ గతనెల 29వ తేదీన తెల్లవారుజామున అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే.. తర్వాత వీరి జీవనం దయనీయంగా మారడంతో శ్రీనివాస్‌గౌడ్ చలించిపోయారు. భోజన వసతి కోసం సరుకులు అందించారు. కార్యక్రమాల్లో మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మునుగుతున్నా పట్టించుకోరా?

- కలెక్టరేట్ వద్ద చిన్నోనిపల్లి వాసుల ఆందోళన

గద్వాల, సెప్టెంబర్ 3 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లోకి వరద వచ్చి గ్రామం ముంపునకు గురవుతుందని, మమ్మల్ని కాపాడాలంటూ మంగళవారం గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వీరేశ్, రామచంద్ర, ఈరన్న, నర్సింహులు, తిప్పన్న, ఈఆర్ గౌడ్ మాట్లాడారు. గట్టు మండలం నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో చిన్నోనిపల్లి గ్రామం ముంపునకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. రిజర్వాయర్‌లో ఉన్న నీటిని 15 రోజులుగా బయటకు పంపేందుకు కాల్వ తీసినా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. 2006లో ప్రాజెక్టు పనులు ప్రారంభమైనా ఇప్పటివరకు పూర్తి కాలేదన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్ ఆర్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటికీ అందులో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పారు. పూర్తి సౌకర్యాలు కల్పించి గ్రామాన్ని అక్కడకు తరలించి రిజర్వాయర్ పనులు చేపట్టాలన్నారు. గ్రామంలో కొంతమందికి మాత్రమే షిఫ్టింగ్ చార్జీలు ఇచ్చారని, మరికొంత మంది ఖాతాలో డబ్బులు జమచేయలేదన్నారు. దీంతోపాటు రైతులకు భూ పరిహారం పూర్తిస్థాయిలో ఇప్పటి వరకు అందలేదన్నారు. డబ్బులు జమ చేసి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతోపాటు 18ఏండ్లు నిండిన వారికి కొత్తప్లాట్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లోని కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న చిన్నోనిపల్లి వాసులు

ఊపిరిపీల్చుకున్న చిన్నోనిపల్లి

- రిజర్వాయర్ నుంచి సమాంతర కాల్వ ద్వారా బయటకు వెళ్తున్న నీళ్లు

గట్టు, సెప్టెంబర్ 3 : చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి వరద బయటకు వెళ్లడానికి అధికారులు చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. సమాంతర కాల్వ పనులు పూర్తికాగా, రిజర్వాయర్ నుంచి నీళ్లు బయటకు వెళ్తున్నాయి. కొన్నాళ్లుగా కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్‌లోకి భారీగా నీరు వచ్చి చేరింది. దీంతో చిన్నోనిపల్లి గ్రామస్తులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ గ్రామంలోకి చేరుతాయేమోనని ఆందోళన చెందారు. కాగా, నీరు బయటకు వెళ్తుండడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ ప్రాంతాన్ని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ గ్రామస్తులు దేవేందర్, శ్రీనివాసులు, జయరాంగౌడ్ తదితరులతో కలిసి మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో జేఈ ఉపేంద్ర, కాంట్రాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నోనిపల్లి రిజర్వాయర్ సమాంతర కాల్వ ద్వారా బయటకు వెళ్తున్న వరద